క్లుప్తంగా

హంతకులపై చర్యలు తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: బాపట్ల జిల్లా రాజోలు బీసీ విద్యార్థి అమర్‌నాథ్‌ను హత్య చేసిన అగ్రకులాలకు చెందిన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ నాయకులు కంచర్ల కోటయ్య గౌడ్ ఆధ్వర్యంలో బీసీ నాయకులు శనివారం స్థానిక తహసీల్దార్ కె.విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలపై ఏదో ఒకచోట దాడులు జరుగుతున్నాయని, వాటిని ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. బీసీ నాయకులు శ్రీనివాసాచారి, గోపాల్, బ్రహ్మం పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజమే జేవీవీ లక్ష్యం

గిద్దలూరు రూరల్: శాస్త్రీయ సమాజమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జేవీవీ రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి అన్నారు. పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు ఆవరణలో శనివారం జేవీవీ సభ్యత్వ కరపత్రాలు, వాల్ పోస్టర్లు విడుదల చేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక సమాజంలోని మూఢ నమ్మకాలను రూపుమాపేందుకు ప్రయత్నిస్తోందన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానంపై అవగాహన సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. జేవీవీ నాయకులు డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ జేవీ నారాయణ, డి.వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

టైలరింగ్‌లో శిక్షణ

ముండ్లమూరు: మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ ట్రైనర్ బాపూజీ శనివారం తెలిపారు. ఒంగోలులోని రూడ్‌సెట్ కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మండల కేంద్రం ముండ్లమూరులో పలు కార్యాలయాల్లో అధికారులను కలిసి శిక్షణ వివరాలు ఆయన వెల్లడించారు. వచ్చే నెల మూడో తేదీ నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తిగా ఉచితమని తెలిపారు. ఆశక్తి ఉన్న మహిళలు 95733 63141 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ముగిసిన జెడ్పీటీసీల శిక్షణ

యర్రగొండపాలెం: జిల్లా కేంద్రం బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో జరిగిన జెడ్పీటీసీల శిక్షణలో ప్రకాశం జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష పాల్గొన్నారు. మూడు రోజులపాటు శిక్షణ పూర్తి చేసుకున్న ఆయనకు శనివారం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ గుర్తింపు సర్టిఫికెట్ అందజేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

దర్శి: దర్శి సర్కిల్ పరిధిలోని దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 60 మందిపై కేసు నమోదు చేసినట్లు దర్శి సీఐ రామకోటయ్య తెలిపారు. వారిలో ఇద్దరికి జైలు శిక్ష, 20 మందికి సుమారు రూ.40 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 378 మందిపై కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. వారిలో 185 మందికి 37 వేల రూపాయల జరిమానా విధించారని, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు బహిరంగా ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యులు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రెస్‌మీట్‌లు పెట్టి పార్టీ ప్రతిష్టను దిగదార్చవద్దు

మార్కాపురం టౌన్: ప్రెస్‌మీట్‌లు ఒంగోలులో పెట్టి పార్టీ పరువు దిగదార్చేలా పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడటం, మార్కాపురం నాయకులపై ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మురారి మురారి వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ఎటువంటి మచ్చలేని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయటం బాధాకరమన్నారు. టీడీపీ నాయకులతో కుమ్మక్కై సొంత పార్టీలో ఉంటు ఇలాంటి ఆరోపణలు చేయటం సిగ్గచేటన్నారు.

ఎమ్మెల్యే మార్కాపురం నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 1500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశారని.. పొదిలిలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న నీటి సమస్యను తీర్చేందుకు సుమారు 50 కోట్ల రూపాయలను మంజూరు చేయింటంతో ఇప్పడు పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉంటే మార్కాపురానికి మరో మెడికల్ కాలేజీ మంజూరు చేయించారన్నారు. సుమారు రూ. 22 కోట్లతో మరో పైప్‌లైన్ ఏర్పాటు, అంతర్గత పైప్ లైన్ నిర్మాణం తదితర పనులు మంజూరు చేయించారన్నారు. జిల్లా పర్యటనలో సీఎం జగనన్నకు బొకే ఇచ్చినంత మాత్రాన పెద్ద నాయకుడివి అయిపోతావా సూర్యప్రకాష్‌రెడ్డి.. అని ఎస్సీ సెల్ నాయకులు కురాటి చెన్నకేశవులు ప్రశ్నించారు. కౌన్సిలర్లు కొత్త కృష్ణ, దొడ్డా భాగ్యలక్ష్మి, నాయకులు డి.బాబి, బి.సతీష్, ఉత్తమ్‌కుమార్, సీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పనులు కొలతల ప్రకారం చేయాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో చేస్తున్న ఉపాధి హామీ పనులు నిర్ణయించిన కొలతల ప్రకారం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మరియదాసు సూచించారు. నాయుడుపాలెంలో ఉపాధి హామీ పనులను ఆయన శనివారం తనిఖీ చేశారు. కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.272 పొందొచ్చన్నారు. సమయం ప్రకారం పనులు చేయాలని సూచించారు.

పేదల సొంతింటి కల సాకారం



15 ఏళ్ల క్రితం ఈశ్వరమ్మ, వీరయ్య దంపతులు ఆడబిడ్డతో పొట్టచేత పట్టుకుని మోక్షగుండానికి వలస వచ్చారు. అద్దె ఇంట్లో కొంతకాలం, పొలంలో పూరిపాకలో ఉంటూ పనులు చేసుకుంటూ, పొలానికి కాపలాదురులుగా జీవనం సాగిస్తున్నారు. గతంలో ఇంటి స్థలం కోసం అనేక ప్రయత్నాలు చేసినా ఎటువంటి ఫలితం దక్కలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ ఇంటికి వచ్చి ఇంటి స్థలం వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇంటి స్థలం మంజూరు కావడంతో ఇంటి నిర్మాణం చేసుకున్నారు. ఈ కుటుంబానికి నేడు సొంతిల్లు ఏర్పడింది.



రమణయ్య, కాశీలక్ష్మమ్మ దంపతులు ఇద్దరు కుమార్తెలతో బేస్తవారిపేటలో అద్దె ఇంట్లో కాపురం ఉంటున్నారు. తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నందవరం నుంచి 13 ఏళ్ల క్రితం వలస వచ్చారు. గతంలో పలుమార్లు నివేశన స్థలం కోసం దరఖాస్తు పెట్టుకున్నా రాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే ఇంటి పట్టా ఇచ్చారు. గృహం మంజూరు చేయడంతో ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారు. చుట్టుపక్కల లబ్ధిదారుల గృహాలకు బేల్దారిగా పనులు చేస్తూ తన సొంతింటిని పూర్తి చేసుకుంటున్నాడు.



కంభం పట్టణంలోని కోనేటి వీధిలో అద్దె ఇంట్లో జీవించే మస్తాన్ కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే చిరకాల కోరిక నేడు సాకారమవుతోంది. తల్లిదండ్రులతో పాటు తానూ రజక వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన భార్య పేరుతో చిన్నకంభం సమీపంలో జగనన్న లేఔట్‌లో ఇంటి స్థలం మంజూరైంది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో పాటు తన దగ్గరున్న మరికొంత డబ్బుతో సొంతిల్లు నిర్మించుకుంటున్నాడు. ఇంటి స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి ప్రభుత్వం సహకారం ఇవ్వడంతో మస్తాన్ ఆనందానికి అవధులు లేవు.



చిన్నకంభం లేఔట్‌లో పూర్తయిన గృహాలు



మోక్షగుండం లేఔట్‌లో జరుగుతున్న నిర్మాణాలు

బేస్తవారిపేట: ఏళ్ల తరబడి పూడి గుడిసెల్లో..అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టి రూ. లక్షలు విలువ చేసే స్థిరాస్తి పేదల సొంతమయ్యేలా చేస్తోంది. వైఎస్సార్ జగనన్న లేఔట్లలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల పనులు జరిగిపోయాయి. నిర్మాణం పూర్తయిన కొన్ని ఇళ్లకు విద్యుత్‌తో పాటు నీటి సరఫరా కనెక్షన్ కూడా ఇచ్చారు. పలు చోట్ల ఇప్పటికే కొందరు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు కూడా చేసుకున్నారు.

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని సంజీవరాయుడుపేట గడికోట ప్రాజెక్టు పరిధిలోని ఓబులాపురం, గడికోట, సంజీవరాయుడుపేట గ్రామాలకు చెందిన వాటర్‌షెడ్‌కు సంబంధించి 128 మంది రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 163 రకాల వ్యవసాయ పరికరాలను రూ.34.22 లక్షల ఉత్పాదకత, పెంపుదల కింద డబ్ల్యూడీసీ–పీఎంకేఎస్‌వై ద్వారా మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలను 80 నుంచి 90 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ బుడతా మధుసూదన్‌రావు, డ్వామా అడిషినల్ పీడీ విజయలక్ష్మి, ప్రాజెక్టు అధికారి నజీర్, సీఎల్ఆర్‌సీ రాజేష్, గడికోట సర్పంచి బంగారు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా

అంగన్‌వాడీలు ఆదర్శంగా ఉండాలి

కొనకనమిట్ల: అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేసి పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో అందజేయాలని సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. శనివారం గొట్లగట్టు, కొనకనమిట్లలో అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే వెళ్లి పౌష్టికాహార వస్తువులను అందిస్తామన్నారు. సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో అధిక దిగుబడులు

బేస్తవారిపేట: రైతులు పచ్చిరొట్ట విత్తనాలు పొలంలో సాగు చేసుకోవడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై జనుములు, జీలుగలు, పిల్లి పెసర విత్తనాలు అందజేస్తోందన్నారు. ఏఓ జక్కం మెర్సీ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి పూత దశలో పొలంలో కలియ దున్నడంతో భూమి సారవంతం అవుతుందన్నారు. జెడ్పీటీసీ బీవీ రాజయ్య, నాయకులు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం విజయవంతం

కొనకనమిట్ల: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో శనివారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ 60 ఏళ్ల పైబడిన వారికి కంటి పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. తొలుత గ్రామ సర్పంచ్ మందా తిరుపతమ్మ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్త వెంకటరమణ సీహెచ్ఓలు వల్లి పద్మ, కొండలరావు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని నాలుగో సచివాలయాన్ని తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అందించే సేవల వివరాల గురించి ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టి పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ కిలారి సుబ్బారావు, వీఆర్ఓ మురళి తదితరులున్నారు.

ఉల్లాసంగా చిత్రలేఖనం పోటీలు



విజేతలతో నెహ్రూ యువ కేంద్రం సభ్యులు, అధికారులు

మార్కాపురం: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువకేంద్రం మార్కాపురం బ్లాక్ ప్రతినిధి సాయి సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వర్షపు నీటిని వడిసిపట్టడంపై చిత్రలేఖనం పోటీలను శనివారం నిర్వహించారు. ఎంఈవో రాందాస్‌నాయక్.. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. హెచ్ఎం చంద్రశేఖరరెడ్డి, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన శర్మ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

చిరుధాన్యాల సాగు పెంపునకు ప్రోత్సాహం

తాళ్లూరు: చిరుధాన్యాల సాగు పెంపునకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. తాళ్లూరు ఆర్‌బీకే వద్ద శనివారం రైతులకు మిల్లెట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైఎస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు కిట్స్ అందించారు. ఎంపీపీ తాటికొండ మాట్లాడుతూ 2023 సంవత్సరం చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున రైతులు తమ బాధ్యతగా కొంత విస్తీర్ణంలో చిరు ధాన్యాలు సాగు చేయాలని కోరారు. ఏఈఓ నాగరాజు, డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్ డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాల వ్యాన్ ఢీకొని బైకిస్టుకు గాయాలు

అర్ధవీడు (కంభం): ద్విచక్ర వాహనాన్ని పాల వ్యాన్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం మండలంలోని బోగోలు సమీపంలో జరిగింది. వివరాలు.. పెద్దపుల్లయ్య అనే వ్యక్తి యర్రబాలెం వైపు నుంచి అర్ధవీడుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బోగోలు సమీపంలో ఎదురుగా వస్తున్న పాల వ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో పుల్లయ్య కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దివ్యాంగులకు అన్నదానం

మార్కాపురం: హెల్పింగ్ హ్యాండ్స్‌ను రూపొందించిన కిట్స్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని స్ఫూర్తి అనాథ ఆశ్రమంలో దివ్యాంగులకు అన్నదానం చేశారు. చిన్నారులకు పుస్తకాలు, దుస్తులు, పంపిణీ చేశారు. కళాశాల కరస్పాండెంట్ కృష్ణచైతన్య మాట్లాడుతూ విద్యను అందించటంతో పాటు, ప్రజా సేవలో తమ కళాశాల ముందుంటుందన్నారు.

ఆవేశంలో చేసిన తప్పులతో శిక్షలు

గిద్దలూరు రూరల్: ఆవేశంలో చేసిన తప్పులతో శిక్షలు అనుభవిస్తారని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవేందర్‌రెడ్డి అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా పట్టణంలోని సబ్‌జైలు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలు తెలుసుకోవాలన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పుల కారణంగా శిక్షలు పడి జైలులో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న వారికి వసతుల్లో లోపం ఉన్నాయా..అని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలని జైలు సిబ్బందిని జడ్జి ఆదేశించారు. జైలు ఇన్‌చార్జి రవీంద్రనాథ్, న్యాయవాది ఫాజిల్, లీగల్ వాలంటీర్ మధు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనే ధ్యేయం

మార్కాపురం టౌన్: ఐక్యరాజ్యసమితి 2030 నాటికి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో క్షయ వ్యాధి ముఖ్యమైందని మార్కాపురం యూనిట్ క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రాంబాబు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు, స్వయం సహాయక బృందాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, టీచర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2025 నాటికి క్షయ వ్యాధి రహిత దేశంగా చేసే లక్ష్యంతో టీబీ ముక్త భారత్ కార్యక్రమం చేపట్టారన్నారు. నిక్షయ్ పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా నెలకు 500 రూపాయల చొప్పున ఆరు నెలల పాటు 3 వేల రూపాయలు వ్యాధిగ్రస్తులకు అందిస్తామని చెప్పారు. డాక్టర్ హిమబిందు, డాక్టర్ కిషోర్‌రెడ్డి, ఎంపీడీవో నరసింహులు, సీనియర్ సూపర్‌వైజర్ గోవిందరాజులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వ్యక్తికి గాయాలు

పొదిలి: ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తికి గాయాలైన సంఘటన స్థానిక మార్కాపురం అడ్డరోడ్డు వద్ద జరిగింది. పొదిలి నుంచి కనిగిరి వైపు బస్సు వెళుతుండగా, మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి హఠాత్తుగా రోడ్డు పైకి రావటంతో బస్సు ఢీకొట్టింది. ఘటనా స్థలాన్ని ఎస్సై మల్లికార్జున సందర్శించి బాధితుడిని వైద్యశాలకు తరలించారు.

సాయితో రుణానుబంధంపై ప్రవచనాలు

మార్కాపురం టౌన్: గురు పౌర్ణమి సందర్భంగా నెహ్రూ బజారులోని షిర్డీ సాయిబాబా మందిరంలో సాయితో రుణాను బంధంపై నెల్లూరుకు చెందిన కె.కృష్ణా భక్తులకు ప్రవచనాలు చేశారు. వారం రోజులు ప్రవచనాలు జరుగుతాయని, విజయవంతం చేయాలని ఆలయ కార్యదర్శి జి.హరిహరరావు కోరారు. పి.సత్యనారాయణ, ఆర్.గోపి పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

తర్లుపాడు: తర్లుపాడు ఎస్సీ కాలనీకి చెందిన పులుకూరి విజయరావు గత వారం ప్రమాదంలో మృతి చెందారు. ఆయన భార్య రంగమ్మకు తక్షణ సహాయం కింద 10 వేల రూపాయలను వైఎస్సార్ బీమా చెక్కును ఎంపీపీ భూలక్ష్మి, సర్పంచ్ పి.వరాలు శనివారం అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీధర్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి

మార్కాపురం: బాపట్ల జిల్లాలో విద్యార్థి అమర్‌నాథ్‌ను పెట్రోలు పోసి సజీవంగా హత్య చేసిన నిందుతులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బీసీ సంఘం నాయకులు పీఎల్‌పీ యాదవ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ సేతు మాదవన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. పీఎల్‌పీ మాట్లాడుతూ బాధితుని సోదరిపై కొందరు దుర్మార్గులు లైంగికంగా వేధిస్తున్న క్రమంలో నిరోధించిన ఆ విద్యార్థిపై పెట్రోలు పోసి పైశాచికంగా తగలపెట్టడం అత్యంత దారుణమైన సంఘటన అన్నారు. రంగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు

తాళ్లూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు సత్వర సేవలు అందించటంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు హెచ్చరించారు. తాళ్లూరు-1 సచివాలయాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లు పరిశీలించి అందుబాటులో ఉన్న సిబ్బంది, సేవల గురించి ఆరా తీశారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కొమరోలు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు కోరారు. మండలంలోని అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాల్లో ఎంపికైన విద్యార్థులకు ప్రతిభ పురస్కారం, జ్ఞాపికను ఆయన అందజేశారు. అనంతరం పాఠశాలను పరిశీలించి జగనన్న గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేసి రుచి చూశారు. జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు విద్యార్థులను సమావేశపరచి మాట్లాడారు. నాడు–నేడు పథకం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీటీసీ జాజం వెంకటరెడ్డి, ఎంఈవో కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకాలమ్మా దీవించమ్మా!

కొనకనమిట్ల: అంకాలమ్మా దీవించమ్మా అంటూ మండల కేంద్రం కొనకనమిట్లలో పురాతన ఆలయం అంకాలేశ్వరి ఆలయంలో శనివారం భక్తులు వేడుకున్నారు. అంకాలమ్మ తల్లి జాతరను జాతరను పురస్కరించుకొని పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున రెండు, టీడీపీ తరపున ఒకటి, మరో మొక్కుబడి ప్రభ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి కుంకుమ బండ్లు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సీఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐ దీపిక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అంకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన ప్రభ

మెరిసిన పుల్లలచెరువు కేజీబీవీ ఆణిముత్యం



అవార్డు అందుకుంటున్న విద్యార్థిని డెలోరిస్

పుల్లలచెరువు: జిల్లాలోనే మారుమూల ప్రాంతంలోని కేజీబీవీ పాఠశాల ఇంటర్ విద్యార్థి ఆణిముత్యమై మెరిసింది. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలో ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చిన వారిని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మట్టిలో ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా జిల్లా అధికారులు అభినందన సభ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా పుల్లలచెరువు కేజీబీవీ విద్యార్థిని బి.డెలోరిస్ బైపీసీలో 907 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించింది. కలెక్టర్ దినేష్‌కుమార్, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదగా రూ.50 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంస పత్రం అందుకుంది. కాలేజీ ప్రిన్సిపాల్ లిల్లీ ప్రకాశ్‌వాణి, ఉపాధ్యాయులను కలెక్టర్, మంత్రి సురేష్‌లు ఘనంగా సన్మానించారు.

ఏకలవ్య విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు

పెద్దదోర్నాల: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి అవార్డులు అందుకున్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏకలవ్య కాలేజీకి చెందిన బైపీసీ విద్యార్థి అంబికాబాయి, ఎంపీసీ విద్యార్థి క్రిష్ణశ్రీబాయి, సీఈసీ విద్యార్థిని శిరీష ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ప్రిన్సిపాల్ శ్యామ్యేల్ జోబ్, తల్లిదండ్రులను సైతం సన్మానించారు.



మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

జగనన్న ఆణిముత్యాలకు బహుమతులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో గత ఏడాది 10వ తరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు శనివారం మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాలకు చెందిన పి.జాహ్నవి 600కు గాను 493, షేక్ మహీరా 423, షేక్ అబ్దుల్ వాహీద్ 421 మార్కులు సాధింటంతో వారికి మెడల్స్, సర్టిఫికెట్‌లను అందజేశారు. హెచ్ఎం రవికుమార్, కౌన్సిలర్ షెక్షావలి, పీఎంసీ చైర్మన్ కరీముల్లా, నాయకులు ఉస్మాన్, ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, గంగాభవానీ, శ్రీనివాసరెడ్డి, ఆదిలక్ష్మి, నూర్జహాన్, సుబ్బారావు, నూర్ అహమ్మద్ పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

తర్లుపాడు: జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జగనన్న విద్యా కానుక అందించినందుకు గాను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు జేవీకే ఆకారంలో కూర్చుని తమ సంతోషం వ్యక్తం చేశారు. విద్యా లక్ష్యాలను చేరేవిధంగా కృషి చేయాలని హెచ్. సుధాకర్ తెలిపారు.



జేవీకే ఆకారంలో విద్యార్థులు

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను కుల, మత, వర్గ పార్టీల భేదం లేకుండా అర్హుత కలిగిన లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండల కేంద్రం రాచర్ల బీసీ భవనంలో ఎంపీడీవో కే.కవితా చౌదరి అధ్యక్షతన నిర్వహించిన వలంటీర్ల పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని వలంటీర్ల వ్యవస్థను స్థాపించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు చేరవేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..అని కొనియాడారు. అనంతరం సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర కింద మండలంలోని 200 మందికి శాలువాలు కప్పి సత్కరించారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, వైస్ ఎంపీపీ ఈదుల సుజాత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, రాచర్ల సర్పంచ్ సగినాల రాయలమ్మ, రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల శ్రీరంగం, సూర పాండురంగారెడ్డి పాల్గొన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా

రెవెన్యూ అధికారులపై ఎమ్మెల్యే అన్నా ఫైర్

రాచర్ల: మండల కేంద్రం రాచర్ల బీసీ భవనంలో ఏర్పాటు చేసి వలంటీర్ల వందనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు యడవల్లి, రాచర్ల, కాలువపల్లె గ్రామాల రైతులు పలువురు రెవెన్యూ సమస్యలు వివరించారు. ఏళ్ల తరబడి రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని డిప్యూటీ తహసీల్దార్ భారతీ బాయ్, రాచర్ల వీఆర్వో మబ్బు ప్రభుదాస్‌లపై ఎమ్మెల్యే అగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి పరిష్కరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, యడవల్లి, రాచర్ల, కాలువపల్లె గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులపై అగ్రహ వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో పూర్తి నమ్మకం కల్పించామని కెఎస్‌పల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి నాయబ్ రసూల్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీ వ్యాధిగ్రస్తులు ఎలాంటి భయం లేకుండా పూర్తి నమ్మకంతో ప్రభుత్వ వైద్యం పొందుతున్నారన్నారు. ఆరు నెలల పాటు ఉచితంగా మందులు పొందడంతో పాటు నెలకు రూ.500 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ కడప లక్ష్మి, ఎంపీడీఓ హేమలత, సంజీవరాయుడుపేట వైద్యాధికారి సుమయా, టీబీ సూపర్‌వైజర్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.